# వచ్చిందొచ్చింది ఓడొచ్చింది!

## గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

**అడుగు పొడుగూ, కనీసం రెండు కేజీల బరువూ ఉన్న బైనాక్యులర్స్‌ని నా నుంచి బలంగా లాక్కున్నాడు, నాలు గేళ్ళ తరుణి. దాంట్లోంచి, దూరంగా సముద్రంలో ఆగి ఉన్న ఓడల్ని మేం చూసినట్టుగా తానుకూడా చూడాలనీ, తాను ఎక్కబోయే ఓడ ఎట్లా ఉంటుందో ఊహించుకోవాలనీ వాడి ఉబలాటం. వాడి మూడేళ్ళ చెల్లెలు, తార, కూడా తక్కువదేమీ కాదు. వాడి దగ్గర్నించి ఆ చైనా బైనాక్యులర్స్‌ని తానూ లాక్కోబో యింది. వాడివ్వలేదు. అన్నాడు,**

''నీకెందుకే ఇది, నువ్వు ఓడల్ని లెక్కపెట్టగ లవా?''

కళ్ళు తిప్పుతూ తార అంది, ''ఆఁ.''

''అయితే మనం ఎక్కే ఆ చివ్వరి ఓడ ఎన్నోదో చెప్పు.''

తార, తనక్కనిపిస్తూన్న ఓడల్ని లెక్కబెట్టింది.

''అది ఒకటీ, అది అయిదూ, అది ఏడూ, ఆ చివ్వరిది మూడు.''

విసుక్కుంటూ అన్నాడు తరుణి, ''సరే, రైటేలే.... మన ఓడ మీద నాన్న ఉన్నాడో లేడో నేను చూసి నీకు చూపిస్తా, నాతో రా''- ఇట్లా అంటూ తారని ఆ డాబా మీద రెండోమూలకి తీసుకెళ్ళాడు ఆ నాలుగేళ్ళ తరుణి.

మేం ముగ్గురమూ-నేనూ, మా శ్రీమతీ, మా అన్నయ్యగారి కోడలు కామాక్షీ-నవ్వుకున్నాం.

కామాక్షి సంతానమే తరుణీ, తారా-ను. మేం అయిదుగురమూ మంగళూరులో పెరంబూరు బీచ్‌లో ఉన్న, ఓడల రాకపోకల కంట్రోల్ టవర్ పై అంతస్తు మీద, నుంచోనున్నాం. మా వరసకి కోడలు కామాక్షి భర్త మొదటి ఇంజనీరుగా పనిచే స్తున్న ఓడ, అక్కడికి పది కిలోమీటర్ల దూరంలో నిలిచిపోయి ఉంది. దాన్నే ఇందాకట్నించీ మేము బైనాక్యులర్స్ లోంచి చూస్తున్నది!

***

అసలు మా దంపతులం మంగళూర్లో ఉన్న మా అల్లుడి ఇంటికి చుట్టపు చూపుగా వెళ్ళాం. వారానికల్లా విశాఖపట్నం నించి మా అన్నయ్య గారి కోడలు కామాక్షి కూడా తన ఇద్దరు పిల్లల్తోనూ వచ్చి మమ్మల్ని చేరింది. ఓడలో తన భర్త మొదటి ఇంజనీరు అనీ, ఆ ఓడ మంగళూరు రేవుకు వస్తుం దనీ, తన పిల్లలూ తను అదే ఓడ ఎక్కి తన భర్తతో కలిసి చైనా వెళ్ళి తిరిగొస్తామనీ-చెప్పింది. అయితే, ఆ ఓడ మంగళూరు ఎప్పుడొచ్చేదీ ఖచ్చితంగా తెలు సుకోమని నన్ను కోరింది.

నేను ఫోన్ ఎత్తాను, ''హల్లో, చెన్నై కార్గోషిప్‌ల క్లియరింగ్ హౌసేనా?. . . ఎమిరేట్స్ ట్రాన్స్‌పో ర్టింగ్ కంపెనీయేనా?

చెన్నై నించి వినబడింది, ''యస్, ఇ.టి.సి.నే. ఓనర్‌ని మహమ్మద్ బిన్ తుగ్లక్‌ని మాట్లాడుతు న్నాను.''

''సర్ చైనా నించి రావలసిన మీ ఓడ మంగ ళూరు ఎప్పుడొస్తుంది?. . . మంగుళూరులో మా బోర్డింగుంది.''

''నాకున్న యాభై ఓడల్లో ఏ ఓడ గురించి చెప్ప మంటారు? . . . అయినా మంగళూర్లో మీ లోడింగ్ ఉండటమేంటి? . . . కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ వారిదే గదా మంగళూరు రేవులో లోడింగంతా?''

''లోడింగ్ కాదన్నార్, బోర్డింగు, బోర్డింగు . . .

మా అబ్బాయి మీ ఓడలో ఫస్ట్ ఇంజనీరు. అతని భార్యా పిల్లలూ ఇప్పుడు ఆ ఓడలో ఎక్కాలి. మా అబ్బాయి పేరు వాలి . . . ఆ ఓడ మంగళూరు ఎప్పుడొస్తుంది?''

మహమ్మద్ బిన్ తుగ్లక్ ఘొల్లున నవ్వాడు. అన్నాడు, ''వలీ-యా! . . . ఇంకెక్కడి వలీ! . . . ఓడా, ఇంజనీరూ – అన్నీ ఖతమ్!''

నా పక్కనే నుంచుని స్పీకర్ ఫోన్‌లోంచి మాటలు వింటున్న కోడలు కామాక్షి కంగారు పడింది. ''ఖతం ఏమిటి మామయ్య గారూ . . . కొంపదీసి జరగకూడనిది ఏదయినా ఆయనకు . . . ''-ఇట్లా అంటూ అప్పుడే గుడ్ల నీరు కుక్కేసుకో వటం మొదలెట్టింది! నాకు మెదడు మొద్దుబా రింది. తేరుకొని అన్నాను.

''అసలేం జరిగింది తుగ్లక్ సార్?''

తుగ్లక్ అన్నాడు, ''చాలా జరిగింది భాయ్ . . . వాడు, వాడు, నికాహ్ చేసేసుకున్నాడు! . . . మా అమ్మాయినే ఇచ్చి పెళ్ళి చేసేసాను. హాంకాంగ్‌లో హోటల్ కొనిచ్చాను. జస్ట్ ఆరు కోట్ల డాలర్లు. ఇంక మా అమ్మాయే షిప్పూ, మా అమ్మాయి దగ్గరే వాడు ఇంజనీరున్నూ! . . . . హ్హా, హ్హా, హ్హా !''

నాకర్థమయింది. నేనన్నాను. ''అయితే మా వాడు వలీ కాదన్నార్, వాలి, వా . . . లి. విశాఖ పట్నం పౌరుడు.

''ఓహో హిందూస్తాన్ వాలా వాలీయా! . . . జెమ్ ఆఫ్ మద్రాస్ ఓడలో ఇంజనీరా! . . . అట్లా చెప్పరేం!. . . . అదిప్పుడు కొలంబోలో లంగరేసి ఉంది. ఐదో తారీకున మంగళూరు రావచ్చు.''

కామాక్షీ, మేమూ ఊరడిల్లాం, లేని గండం గడి చినందుకు!

ఇది మొదలు కామాక్షిలో ఏదో భయం మొద లైంది. ఆ భయం నిజమేమో అన్నట్లు ఆ ఓడ, మంగళూరు చేరేటప్పటికి పదో తారీకొచ్చేసింది. ఐదో తారీకునించి పదో తారీకు వరకూ కామాక్షి భయం పోగొట్టటానికి నేను యాభైఫోన్లు చెన్నైకీ, కొలంబోకీ, మధ్యలో కాలికట్‌కీ చెయ్యాల్సొచ్చింది!

ఓడ వచ్చింది కదా అనుకుంటే మళ్ళీ తిరకాసు! రేవులో బెర్తులు ఖాళీ లేవుట, అందుకని మంగళూరు రేవుకు పది కిలోమీటర్ల దూరంలో, అంతర్జాతీయ జలాల్లో లంగరు దింపి ఆగిపోయింది ఆ ఓడ ! మా వాడి దగ్గర్నించి వార్తలు అస్సలు అందటమేలేదు.

కామాక్షికి మళ్ళీ ఏదో దిగులు!

ఇంక నాకు అష్టకష్టాలు తప్పలేదు. ఆయిల్ కంపెనీలో పనిచేసే మా అల్లుడు బొంబాయిలో ఉంటే, అతని ద్వారా, వాళ్ళ ఛైర్మన్‌కి, ఆ ఛైర్మన్ నించి ఇంకో ఫోర్‌మన్‌కి ఇట్లా అంచీలు అంచీలుగా రికమెండేషన్లు చేయిస్తూ కూర్చోవటమే నా పని అయ్యింది. కామాక్షి ఎం.ఎస్.సి చదివిన పిల్లే. కానీ సహజమైన సాత్వికతకు ఇప్పటిస్థితిలో ఉన్న ఆందో ళన తోడు కావటంతో ఆమె దిగాలుగా ఉండిపో యింది.

నేను ఎట్లాయితేనేం మంగళూరు ఓడల ట్రాఫిక్ మేనేజర్ అనుమతినీ, దాని ద్వారా అక్కడి పెరంబూర్ బీచ్‌లో ఉన్న కంట్రోల్ టవర్ ఎక్కే అనుమతినీ-సంపాదించాను. అదుగో ఆ అనుమతి వల్ల మేం అయిదుగురమూ వెళ్ళి ఆ టవర్ ఎక్కాం. ఆ కంట్రోలర్ ఇచ్చిన బైనాక్యులర్స్ లోంచే ఆ ఓడ, ''జెమ్ ఆఫ్ మద్రాస్''ను పెద్ద వాళ్ళమూ పిల్ల లమూ వీక్షించగలిగాం! వాతావరణం బాగుండక ఆ ఓడ మసక మస ్గా కనిపించింది. దానికే కామాక్షి పరవశించిపో ంది!

కానీ ఏం లాభం? మా వాడికి మెస్సేజ్ పంప టానికి వీల్లేకపోయింది.

ఇది మళ్ళీ కామాక్షికి కొత్త దిగులు!

***

ఎట్లాగో పధ్నాలుగో తారీకునాటి అర్ధరాత్రికి

తక్కుతూ తారుతూ ఆ 'మహత్తరమైన' ఓడ 'జెమ్ ఆఫ్ మెడ్రాస్' రేవులోకి వచ్చింది. కానయితే మర్నాడు మధ్యాహ్నం ఒంటిగంటకే వెళ్ళిపోతుందట. టైమ్ ఎక్కువ లేదు కాబట్టి ఓడలోంచి చీమ కూడా రేవులోకి దిగకూడదట! కనక మేమే రేవులోకి వెళ్ళి ఓడెక్కి మా వాడిని కలుసుకోవాలి.

–వాలి సెల్‌ఫోన్లో బ్యాటరీ అయిపోవటం చేత, ఓడలోని కమ్యూనికేషన్స్ ఆపరేటర్ పోర్టుకు చెబితే, పోర్టు వారు కంట్రోలర్‌కు చెబితే ఆయన మా ఇంటికి చెప్పగా తెలిసిన కబురు ఇది!

ఈ కబురు విన్నప్పట్నించీ కామాక్షికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఎట్లాగో తెల్లవారి అయిదు గంటలకే ఆదరా బాదరా అందరం బయల్దేరాం. తన పాతిక సూట్‌కేసుల్తోనూ బయల్దేరబోయింది, కామాక్షి. నేనన్నాను, "అమ్మా, ఒక్కసారి ఓడలోకెళ్ళి మీ ఆయన్ని చూసి తిరిగొచ్చి సామాను తీసికెళ్ళువు గాని" అని. కామాక్షి "సరే"నంది.

ఓడరేవు ప్రవేశ ద్వారం , 'మాల్యాగేటు' దగ్గరికి మేం చేరుకునేటప్పటికి టైము ఉదయం ఐదున్నర.

అక్కడున్న గేటు కమాండెంటు, శ్రీపాదపిక్సే, మా కాగితాలన్నీ మళ్ళీ మళ్ళీ చూసి ఆరున్నరకి మమ్మల్ని లోపలికి వదిలాడు.

ఇంక అక్కణ్ణించి ఇనుప ఖనిజం పల్చగా చల్లినట్లున్న సిమెంటు రోడ్డుమీద మాకు నడకే గతి! దూరంగా బెర్తుల్లో ఓడలు కనిపిస్తూనే ఉన్నాయి. కానీ ఎంతకీ దగ్గరవ్వవు! మా 'జెమ్' ఇంచుమించు కిలోమీటరు దూరంలో ఉంది. కామాక్షి నడక కాదు. ఇంచుమించు పరుగు. వచ్చేపోయే ఇనుప ఖనిజం ట్రక్కుల బారి నుంచి పిల్లల్నీ మమ్మల్ని మేం కాపాడుకుంటూ మా 'జెమ్' దగ్గరికి వెళ్ళేసరికి ఉదయం ఏడు గంటలు.

అందరం చెక్కనిచ్చెన ఎక్కి ఓడపైకి వెళ్ళాం.

కామాక్షి అయితే రెండేసి మెట్లు ఒకే అంగలో ఎక్కింది!

పైన డెక్‌మీద నుంచుని ఉన్నాడు వాలి. మమ్మల్ని పక్కనే ఉన్న తన కాబిన్‌లోకి తీసికెళ్ళాడు. మాకేదో చెప్పబోయాడు.

హఠాత్తుగా అతణ్ణి వాటేసుకుంది కామాక్షి. తన తలను అతని గుండెల మీద అటూఇటూ రుద్దింది.

మా దంపతులం స్థాణువులమైపోయాం! 'ఈరోజుల్లో, ఇంత చదువుకున్న పిల్లల్లో కూడా విరహం ఇంత తీవ్రంగా ఉందా?' అని ఆశ్చర్యపోవటం మా వంతయింది!

వాలి కాబిన్, రెండు గదులూ, బాత్‌రూముల్తోనూ, డి.వి.డి. ప్లేయర్‌తోనూ, చిన్న లైబ్రరీతోనూ, – ఒక చిన్న స్వర్గం లాగా ఉంది. వాలి, కామాక్షిని తన బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళాడు. పిల్లలు తండ్రిని మర్చిపోయినట్లున్నారు, అక్కడున్న ఏ.సీ., ఫ్రిజ్, నాలుగు ఫోన్లూ – వీటితో కిష్కింధకాండను సాగిం చేస్తున్నారు.

నా మనస్సులోకి కూడా రొమాన్స్ వచ్చేసింది. నా శ్రీమతితో నేనన్నాను, "నేను ఎప్పుడూ రాని ఈ కొత్త చోట, కూర్చుని, పూర్తిగా కొత్త విధంగా, ఆ చిన్న పనిని చెయ్యాలనిపిస్తోంది, ఇట్రావోయ్ డార్లింగ్!" – ఇల్లా అంటూ అక్కడున్న చిన్న సోఫాలో కూర్చుండిపోయి, నా పక్కన చోటు చూపించాను. నా భార్య రాలేదు. పైగా చురుగ్గా అంది, "అయ్యో రామ, నేనుగాక పోతే ఇంకెవరు, మీకు ఈ వయస్సులో! . . . . ఇంటికెళ్ళగానే అంట్ల గిన్నెలన్నీ తోమి పెట్టండి! మీ కోరిక తీరుతుంది!"

నేను గతుక్కుమన్నాను. మరు క్షణంలో ఇద్దరం పకపకా నవ్వుకున్నాం.

వాలి దంపతులు, ఎప్పుడొచ్చారో గది లోంచి బయటకొచ్చారు.

వాలి, "రండి బాబాయ్ ఓడ చూపిస్తాను" అన్నాడు. అందరం అతని వెనక బయల్దేరాం. ఓడంతా చూసాం.

ఇంతసేపూ కామాక్షి తన భర్తను ఆనుకుని, అతని భుజం మీద తనచేతులుంచి ఒదిగి ఒదిగి నడుస్తూ వస్తోంది. కొత్తచోట కొచ్చిన బెదురూ, అమాయకత్వమూ, ఏదో ఆదుర్దా–ఇవి ఆమె కళ్ళల్లో కనిపిస్తున్నాయి.

ఇంతలో లౌడ్ స్పీకర్లోంచి ప్రకటన వినిపించింది.

"అటెన్షన్ ఆల్ క్రూ ! . . . కెప్టెన్ క్రిస్టోఫర్ మాట్లాడుతున్నాడు . . . హఠాత్తుగా రిపేరు కొచ్చిన భారత నావికా దళం ఓడకు ఇక్కడ



బెర్తింగ్ ఇవ్వవలసి వచ్చిన కారణంగా, లోడింగ్‌ను పూర్తిచేసుకున్న మన ఓడ, ఈ రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు బదులుగా ఇప్పుడే, ఈ ఉదయం ఎనిమిదిన్నర గంటలకే లంగరెత్తుతోంది. . . . అంటే, ఇంకో అరగంట మాత్రమే టైముంది. . . . పైలట్ బోట్ వచ్చి టోయింగ్‌కు సిద్ధంగా ఉంది. . . . ఫస్ట్ ఇంజనీర్ మిస్టర్ వాలీ, ఇంజన్లు చూసుకోండి . . . ఓవర్.''

వాలి, కరెంటు షాకు తిన్నవాడిలాగా కంగారు పడ్డాడు! మాతో, ''దిగండి బాబాయ్, ఓడ దిగిపోండి!'' అన్నాడు.


కామాక్షి కంగారుగా, ''అదేంటండీ, సామాన్లు తెచ్చుకునే టైము కూడా ఇవ్వరా? . . . . ఒక్కగంట! . . . . పోన్లెండి, ఇల్లాగే వచ్చేస్తాం !'' అంది.

వాలి అన్నాడు, ''ఇల్లాగెల్లా వస్తావు? . . . ఓడ ఇక్కడ లంగరెత్తిందంటే తిన్నగా వెళ్ళి చైనాలో షాంఘై రేవులో ఆగటమే! . . . . పదిహేను రోజుల ప్రయాణం!. . . బట్టలు సరే, పిల్లలకి మందులూ, తినుబండారాలూ, ఆట వస్తువులూ అయినా అక్కర లేదా? . . . . నెక్స్ట్ టైం వచ్చినప్పుడు తప్పకుండా ముందే సామాన్తో వచ్చి నన్ను కలుద్దువుగాని. అప్పుడయితే సింగపూర్, హాంగ్‌కాంగుల్లో వారమేసి రోజులు హాల్టులున్నాయి. హాయిగా ఎన్‌జాయ్ చెయ్యొచ్చు. బాధపడకు!''

డగ్గుత్తికతో కామాక్షి చటుక్కున అంది, ''నాకు హాయీ వద్దూ, ఎంజాయి వద్దూ ఇలా మీరు నా పక్కన ఉంటే చాలు!''– ఇల్లా అంటూనే చటుక్కున మళ్ళీ అంది, ''పోనీ మీరు వెళ్ళి మీ కెప్టెన్‌తో నా విషయం చెప్పి ఒక్క గంట టైమ్ అడక్కూడదూ! . . . మిమ్మల్ని విడిచి ఇంక ఒక్క క్షణం కూడా ఉండలేనండీ!''

–ఆమె గొంతులోంచి దుఃఖం భళ్ళున ఎప్పుడు పైకి వద్దామా అని తొందరపడుతోంది.

వాలి అన్నాడు, ''అమ్మో, కెప్టెన్ క్రిస్టోఫర్ ఎదుట పడటమే! . . . అతని విషయం నీకు తెలీదు! చండశాసనుడు! స్ట్రిక్టంటే స్ట్రిక్టు! . . . నా ఉద్యోగం ఊడగొట్టగలడు! . . . నా మాటవిని వెళ్ళిపో! . . . . ఒక్క రెణ్ణెల్లు ఆగు!''



కామాక్షి తన భర్త వంక తీక్షణంగా చూసింది. క్రమంగా ఆమె మెడ కండరాలూ, చేతి కండరాలూ, పిడికిలీ బిగుసుకున్నాయి. కళ్ళ రెప్పలు దగ్గర య్యాయి. ఉరిమినట్లుగా అంది ఆమె, ''క్రిస్టోఫర్ క్యాబిన్ ఎక్కడ ?''

''పై అంతస్థులో. సరిగ్గా నా క్యాబిన్ పైన.''

కామాక్షి మెట్లవైపు దూకేసింది.

మా దంపతులమూ పిల్లలమూ ఏం చెయ్యాలో తోచక తికమకగా నిల్చుండిపోయాం.

అయిదు నిముషాల తర్వాత కామాక్షి తిరిగొచ్చింది. ఆమె అల్లా వచ్చిందో లేదో ఇల్లా వాలి బల్ల మీది స్పీకర్ ఫోను మోగింది. క్రిస్టోఫర్ మాటలు వినిపించాయి.

''అటెన్షన్ మిస్టర్ వాలి! . . . నీ భార్య ఇప్పుడే నా దగ్గరకొచ్చి ఒక గంటన్నర టైము ఇస్తే తాను ఊళ్ళోకెళ్ళి తన లగేజీ తెచ్చుకుని నీతో ఓడెక్కుతానని అంటోంది. . . .

రెండేళ్ళుగా ఆమె, నీ పిల్లలూ నీకు దూరంగా ఉన్నారనీ, నీ పిల్లవాడు నిన్ను మర్చిపోతున్నాడనీ అంటూ ఆవిడ ఏడ్చింది! . . . నిన్ను ఆవిడ ఇక్కడ జాయిన్ అవ్వబోతున్న విషయం ముందుగా నువ్వు నాకు ఎందుకు తెలియపరచలేదు? – నీకు రెడ్ ఎంట్రీ పడాలి! . . . సర్లే, ఆవిడ నా క్యాబిన్‌లోకి రావటమే సాహసం! . . . ఆడవాళ్ళు సహజంగా మట్టిముద్దలయ్యా. కానీ సమయం వస్తే వాళ్ళే వీరవనితలవుతారు.

. . . నా క్యాబిన్‌లోకి చొచ్చుకొచ్చిన ఆవిడ సాహసానికి మెచ్చుకుంటున్నాను. . . . కాగా, ఏడాదయితేనే పిల్లలేంటయ్యా, భార్యే మర్చిపోతుంది, మగాణ్ణి! అటువంటిది రెండేళ్ళాగింది నీ భార్య! . .

నా . . . నా . . . నా విషయం చూడు! అరే, అరే . . . నా భార్య . . . హాంగ్‌కాంగ్ . . . నేను చూసి . . . అదే, అదే . . . ఏడాదయ్యింది.

. . . ఇప్పుడు న్యూస్ . . . ఏంటంటే . . . . ఆ బాస్టర్డ్‌ని ఎవణ్ణో . . . షిట్! . . . . ఇదంతా నీ కెందుకులే . . . ఓ.కె. , ఓ.కె., ఖచ్చితంగా ఒక గంటన్నర టైమిస్తున్నాను. ఆవిడను వెళ్ళి లగేజీ తెచ్చుకుని వచ్చి ఓడెక్కమని చెప్పు. ఆవిడకు సహాయం చెయ్.

నువ్వు షిప్ దిగటానికి మాత్రం పర్మిషన్ లేదు. . . . ఓ.కే ? . . . ఓవర్!''

అంతా, గంటలోపలే తన సామానుతోను పిల్లల్తోనూ ఆదరాబాదరా ఓడెక్కేసింది కామాక్షి.

ఓడ కూతవేసి బయల్దేరబోతుంటే మా ఆవిడతో నేనన్నాను, ''మా అన్న కూతురు కాబట్టి అంత సాహసం చూపింది కామాక్షి!''

చటుక్కున మా ఆవిడ అంది, ''ఏడ్చినట్టుంది, అది మా ఆడ జాతి మనిషండీ !''

★

ఫోన్ 08812-232259